విజయపథం

సి. నరసింహారావు

ఈనాడు ఆదివారం

లో ప్రచురితమైన
'వ్యక్తిత్వవికాసం'
ఆణిముత్యాల
సమాహారం

జీవితాన్ని ఉన్నతంగా మార్చివేసే
నిర్ణయాలు తీసుకోవడానికి
నిరంతరం తోడ్పడే గ్రంథం

Vijayapadham

Anthology of articles on personality development touching all aspects of life

By C. Narasimha Rao

Language : **Telugu**

First Edition : **August 2007**

Price : **Two Hundred Rupees**

Publishers :

Nani International,

408, Vijaya Towers, Shantinagar, Hyderabad - 500 028

Phones : 66665146, 98661 81388

Copies available at all the Branches of

Visalandhra Book House.

To my son

C. Harsha

with love

విజయయానం

పరివర్తన ..10

I. విజయం, జీవన వికాసం • • • • • 16

1) విజయమంటే ఏమిటి? .. 18
2) విజయపథంలోకి ప్రవేశించడమెలా? .. 21
3) మానవప్రయత్నానికి మించింది లేదు. .. 24
4) విజయం సాధించే రహస్యాలేవీ లేవు .. 27
5) ఎంతటి విజయాన్నయినా స్వంతం చేసుకోవచ్చు .. 30
6) ఏది నిజమైన విజయం? .. 33
7) విజయాన్ని జీవన విధానంగా మార్చుకోవాలి .. 36
8) విజేతల ప్రవర్తన ఎక్కడ, ఎలా భిన్నంగా వుంటుంది? .. 39
9) మాములు విజయాలే కాదు అద్భుత విజయాలు సాధించవచ్చు. .. 42
10) విజేతల విశిష్టత ఏమిటి? .. 45
11) మీరు కోరేది మీరే సృష్టించుకోవచ్చు .. 48
12) మనకంటే మనం ఉన్నతంగా ఎదగాలి ? .. 51
13) విజయం ఎక్కడ దాగివుంది? .. 54
14) విజయం ఎవరిని, ఎలా వరిస్తుంది? .. 57
15) సమిష్టి కృషి అద్భుత విజయాలనందిస్తుంది .. 60
16) విలువలు లేనప్పుడు విజయం లభించదు .. 63
17) లక్ష్యాన్నిబట్టే విజయం లభిస్తుంది. .. 66
18) అదృష్టం ఎవరిని వరిస్తుంది? .. 69
19) తపస్సులాగా చేస్తే ఎంతటి విజయమైనా సొంతమవుతుంది. .. 71
20) ఆకాశమే హద్దు అవకాశాలను వదలొద్దు .. 74
21) విజయాన్ని అర్థంచేసుకోవడమెలా? ..77
22) మనసులోనే విజయానికి పునాది వేయాలి. .. 80
23) ఏదీ అసాధ్యం కాదు! ..83
24) తలుపులు మూయవద్దు .. 86
25) లక్ష్యాన్ని ఏర్పరచుకొంటే అద్భుతాలు ఎదురవుతాయి .. 89

II. ఉన్నత మానవ విలువలు • • • • • 92

1) నిజ విలువలు విడనాడవద్దు. .. 94
2) గొప్పతనం ఎలా వస్తుంది? .. 97

3) ఉన్నతంగా ఎదగడానికి తోడ్పడే మూల సూత్రాలేమిటి? .. 100
4) ఉన్నత లక్ష్యాలు ఏవి? .. 103
5) నిజాయితీయే నిజమైన మందు .. 106
6) ఎక్కడ, ఎప్పుడు, ఎలా నేర్చుకోవాలి? .. 109
7) జీవితంలో అతి ప్రధానమైనది ఏది? .. 112
8) స్వచ్ఛమైన ప్రవర్తనే ముందుకు నడిపిస్తుంది. .. 115
9) నాయకత్వ లక్షణాలేమిటి? .. 118
10) విజయసాధనకు తోడ్పడే కుటుంబ జీవన రహస్యాలు .. 121
11) విలువైన జీవనపాఠాలు ఏవి? .. 124
12) గర్వించదగిన గొప్ప పని ఏది? .. 127
13) మంచితనమే మేలైన మార్గం .. 130
14) నిజాయితీ ఎందుకు? .. 133
15) ఉన్నత విలువలే మార్గదర్శకాలు కావాలి. .. 136
16) మంచివారికే కష్టాలెందుకు వస్తాయి? .. 139
17) నాయకత్వ లక్షణాలు ఏవి? .. 142
18) రైతును ఆదర్శంగా గైకొంటే... .. 145
19) అర్థకత్వం వేరు. మంచితనం వేరు. .. 148

III. ప్రతికూల భావనలు • • • • • • 151

1) ప్రతికూల స్థితిని అనుకూలంగా మార్చుకోవచ్చు .. 153
2) వున్నదానిని గురించే ఆలోచించాలి. .. 156
3) ప్రారంభించని పనులను వాయిదా వేస్తున్నామనుకోవద్దు .. 159
4) పాత అభిప్రాయాలకు అంటిపెట్టుకువుండవద్దు .. 162
5) సర్వం కోల్పోవడం అసలు సాధ్యం కాదు .. 165
6) ప్రతికూల భావనలను గుర్తిస్తే చాలు .. 168
7) ఒక దారి వుండి తీరుతుంది! .. 171
8) అభిప్రాయాలే కీలకం .. 174
9) మనం కళ్ళారా చూసేది నిజమా? కాదా? .. 177
10) మనపట్ల ఎదుటివారి అభిప్రాయాలను మనకు అన్వయించుకోవద్దు.. 180
11) జీవితాన్ని ఎందుకు మెరుగుపరచుకోరు ? .. 183
12) ఏది సాధ్యం? ఏది అసాధ్యం? .. 186
13) ఏది సత్యం? ఏది అసత్యం? .. 189
14) పరిస్థితులకు బంధీలు కావద్దు .. 192
15) మిమ్మల్ని మీరు తక్కువగా అంచనా వేసుకోవద్దు. .. 195
16) ఆత్మవిశ్వాసం వున్నవారు ఇతరుల అంచనాలపై ఆధారపడరు. .. 198
17) తప్పు అభిప్రాయాల విషవలయంలో చిక్కుకోవద్దు .. 201
18) ఎవరికైనా కోరుకున్నదే లభిస్తుంది .. 204

19) ప్రతిభ ప్రక్కదోవపడితే, అవకాశాలన్నీ అడుగంటిపోతాయి .. 207
20) ప్రతికూల భావనలు విడనాడాలి .. 210
21) బాధాకర అనుభవాలను మరచిపోవడమెలా? .. 213
22) పాత అభిప్రాయాలను ఎప్పటి కప్పుడు సవరించుకోవాలి. .. 216
23) కష్టాలను అధిగమించడమెలా? .. 219
24) ఏ వైఫల్యం అంతిమం కాదు .. 222
25) తథాస్తు అంటే ముప్పే .. 225
26) వేదనకు లోనుకావడం అలవాటుగా మారిందా? .. 228
27) అపనమ్మకంలేకుంటే అసాధారణ విజయాలు సాధించవచ్చు .. 231
28) మారుతున్న కాలంతో పాటు మారాలి. .. 234
29) కొత్తవారిని కలవడం ఇబ్బందిగా వుందా? .. 237

IV. ప్రవర్తన, ప్రభావాలు • • • • • • 237

1) ఎదుటివారిని అర్థం చేసుకోవడమెలా? .. 242
2) కోరిన రీతిలో మీరు మారవచ్చు .. 245
3) మంచి లక్షణాలను ఎత్తి చూపాలి. .. 248
4) ధైర్యమంటే ఏమిటి? .. 251
5) అందరూ సంతోషంగా వుండవచ్చు .. 254
6) అహంభావం వ్యక్తిత్వాన్ని క్రుంగదీస్తుంది .. 257
7) నిరాశామయ జీవితాన్ని ఎందుకు ఎంచుకొంటారు? .. 260
8) విచారం ఎందుకు? .. 263
9) అవమానాల్ని ఎదుర్కోవడమెలా? .. 266
10) ఎందుకీ అహంభావం? .. 269
11) తోటివారిని ప్రేమించకల్గడమే విజయరహస్యం. .. 272
12) ప్రేమను వ్యక్తం చేయండి .. 275
13) శారీరక లోపాన్ని మానసిక లోపంగా మార్చుకోవద్దు .. 278
14) మిమ్మల్ని ఆగ్రహావేశుల్ని చేసేది మీ ఆలోచనాధోరణే! .. 280
15) మిమ్మల్ని మీరు ప్రేమిస్తున్నారా? .. 282
16) అందరి ప్రేమాభిమానాలు పొందడమెలా? .. 285
17) ఉన్నత ప్రవర్తనకు పునాదులేమిటి? .. 288
18) కపటం వద్దు .. 291
19) ప్రవర్తనకు అనుగుణంగానే ఫలితం లభిస్తుంది. .. 294
20) మన సమాజం ఎలా మారుతోంది? .. 297
21) మిమ్మల్ని ఆడించే అవకాశం ఎవ్వరికీ ఇవ్వవద్దు .. 300
22) మిమ్మల్ని ఒంటరితనం వేధిస్తోందా? .. 302
23) నిగ్రహమే మన నిగ్గు తేలుస్తుంది. .. 305

V. ఆలోచనలు,అవకాశాలు • • • • • • 308

1) దేనిపై మీ ఏకాగ్రత? ..310
2) ఉన్నతంగా ఎదగాలన్న ఆలోచనే ఉన్నతికి మూలం .. 313
3) మన నిర్ణయాలే మన జీవితాన్ని నిర్దేశిస్తాయి .. 316
4) మానసికపరిణతి పొందడమెలా? .. 319
5) పటిష్టమైన స్నేహానికి నిజమైనపునాదులేమిటి? .. 322
6) మీ జీవితం మీ కోసమే! ఇతరుల కోసం కాదు. .. 325
7) మైత్రికి అడ్డత్రోవలు లేవు! .. 328
8) జీవితానికి సార్థకత ఎలా లభిస్తుంది? .. 331
9) ఆలోచనలు కాదు ఆచరణ ముఖ్యం .. 334
10) స్వేచ్ఛగా ఆలోచించండి .. 337
11) మీరేం కోరుకుంటున్నారు? .. 340
12) అంతా మీ చేతిలోనే వుంది. .. 343
13) ఆలోచనలనే అవకాశాలుగా మార్చుకోవచ్చు .. 346
14) మీ జీవితంలోనే ఇంద్రజాలాన్ని సృష్టించుకోవచ్చు .. 349
15) మార్పు ఒక్కటే శాశ్వతం, స్థిరం .. 352
16) నిరంతరం ఉన్నతంగా ఎదగడానికి ప్రయత్నించాలి .. 355
17) ఆలోచనలకు అనుగుణంగా ప్రవర్తించుతున్నారా? .. 358
18) ఆలోచనలకున్న పరిమితులను అధిగమించాలి .. 361
19) అన్నివేళలా స్వతంత్రంగా ప్రవర్తించకలుగుతున్నామా? .. 364
20) ఏది వాస్తవం! .. 367
21) మిమ్మల్ని వేధించే ప్రశ్నలు ఏవి? .. 370
22) మన ఆలోచనలే అన్నిటికీ మూలం .. 373
23) మార్పుకు నాంది పలకండి. అద్భుతం సాక్షాత్కరిస్తుంది. .. 376
24) ఉన్నతస్థాయి ఆలోచనా ధోరణిని అలవరచు కోవడమెలా? .. 379
25) మనం అతిశక్తిపంతులం .. 382
26) కొత్త ఆలోచనలెలా వస్తాయి? .. 385
27) ఆలోచనలుమారితే అన్నిసాధ్యమే .. 388
28) స్థిర విశ్వాసాలకు పోకండి! .. 391
29) మంచి అవకాశాలను ఎలా పసిగట్టాలి? .. 394
30) మీరెంటువంటి నిర్ణయాలు తీసుకొంటున్నారు? .. 397
31) మీ అందంపట్ల మీకున్న అభిప్రాయమే అతి ముఖ్యం .. 400
32) ఎవరికైనా లభించేవి 1440 నిమిషాలే! .. 403
33) అన్ని సందర్భాలలో బాధ్యతా యుతంగా ప్రవర్తించడమెలా? .. 405
34) ఆశావాదులు, నిరాశావాదుల తేడా ఆలోచనలు మాత్రమే .. 408
35) ఎవరైనా ఉన్నతంగా ఆలోచించవచ్చు. .. 411
36) ఇతరుల ప్రేమను పొందగోరుతున్నారా? ..414

పరివర్తన

జీవితంలో మనం నిరంతరం మారుతుంటాము. ఎప్పటికప్పుడు మన రూపంలో అనేక మార్పులు వస్తుంటాయి. మన అభిప్రాయాలు మారుతుంటాయి. మన విశ్వాసాలు మారుతుంటాయి. మన దృక్పథం, చివరకు మన ప్రవర్తనా సరళి ఎప్పటికప్పుడు మారుతుంటాయి.

అయితే జీవితంలో చోటుచేసుకొనే ఈ మార్పులన్నీ, మనం పూర్తి అవగాహనతో ఆహ్వానించినవి కావు. ఎప్పటికప్పుడు మన చుట్టూ వున్న పరిస్థితులకు అనుగుణంగా, సన్నిహితమైన వ్యక్తుల ఆలోచనలను అనుసరించి మనం మారుతుంటాము. అత్యధిక సందర్భాలలో అనాలోచితంగా మనం ప్రభావితమవుతుంటాము. ఆయా ప్రభావాల వరవడిలో కొట్టుకుపోతుంటాము. ఆ తరువాత ఎప్పుడైనా గత జీవితాన్ని పునఃసమీక్షించుకోవాలసిన అవసరం వచ్చినప్పుడు అతి విలువైన సమయాన్ని అర్థరహితంగా వృధాచేశామేమిటని అనిపిస్తుంది. గడిపిన జీవితమంతా కోరి స్వయంగా ఎంచుకొన్నది కాదని, జీవన ప్రవాహంలో అయోమయంగా కొట్టుకుపోయామని గుర్తించకల్గుతాము.

ఇటువంటి తప్పిదం చేయకుండా ఈ గ్రంథం పరిరక్షిస్తుంది. ఇప్పుడు ప్రతిఒక్కరికీ తాము అభిలషించిన రీతిలోఉన్నతంగా పరివర్తన చెందగల అవకాశం లభిస్తోంది. జీవితంలో అనాలోచితంగా, యాంత్రికంగా సాగిపోకుండా ప్రతి పనిని పూర్తి అవగాహనతో చేయగల, ప్రతి నిర్ణయాన్ని బాధ్యతతో తీసుకోగల అవకాశం ఇప్పుడు ప్రతి ఒక్కరికీ లభిస్తోంది. ఫలితంగా బాహ్య పరిస్థితులకు, బాహ్య ప్రభావాలకు అనుగుణమైన రీతిలో సాగిపోకుండా, మన ఆలోచనలకు, లక్ష్యాలకు అనుగుణంగా బాహ్యప్రపంచంలో మార్పులు తేగల మన శక్తి సామర్థ్యాలను వెలువరించే అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అందరిలా ప్రవాహంలో కొట్టుకుపోకుండా, ప్రవాహపు దిశను మళ్ళించడంకోసం ప్రయత్నించవచ్చు. చుట్టూవున్న వారికి భిన్నంగా ఆలోచించవచ్చు. భిన్నంగా ప్రవర్తించవచ్చు. అత్యధికశాతం మంది గాఢంగా విశ్వసించే అభిప్రాయాలను త్రోసిపుచ్చవచ్చు.

పసితనంలో చుట్టూ వున్న ప్రపంచాన్ని అవగతం చేసుకోవడానికి, ఈ ప్రపంచం పట్ల తమదైన అవగాహన ఏర్పరచుకోవడానికి, తల్లితండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, చుట్టు ప్రక్కల వారు ఎంతగానో తోడ్పడతారు. మానవ నాగరికతా పరిణామ క్రమంలో, మానవజాతి నేర్చుకొన్న అతి విలువైన అనుభవాల సారాన్ని ఎప్పటికప్పుడు నూతన తరానికి నేర్పడం ద్వారానే మానవ ప్రగతి సాధ్యపడు తోంది. ఈ సమాజానికి దూరంగా, ఒంటరిగా పెరిగేవారెవరయినా ఆదిమ మానవుల స్థాయిలోనే మిగిలిపోతారు. అతి విలువైన నాగరికతా వైభవాన్ని, ఈ సమాజంలో పెరిగే ప్రతి ఒక్కరూ ఆయాచితంగానే స్వంతం చేసుకోకల్గుతున్నారు.

శతాబ్దాలుగా మానవజాతి తమ ఉన్నతి కోసం సలిపిన పోరాట ఫలితాలను అవలీలగా మనకు అందిస్తున్న వర్తమాన సమాజం, మన ఆలోచనలపైన అతిబలమైన పరిమితులు కూడా విధిస్తోంది. వర్తమాన సమాజం ఎప్పుడూ, గతకాలపు అనుభవాలను, వికాస క్రమాన్ని ప్రతిబింబించే దర్పణంగా మిగులుతుందే తప్ప, ఉజ్వల భవిష్యత్తుకు రాచబాటలు వేయగల శక్తి దానికి వుండదు. ఈ కీలక అంశాన్ని అత్యధిక శాతం మంది గుర్తించరు. ఇంతటి అద్భుత ప్రగతికి కారణమైన అనుభవాలను ఆశ్రయించుకు వుంటే, తమ వికాసం దానంతటదే సాధ్యపడుతుందని చాల మంది విశ్వసిస్తుంటారు. అందుకే నేటి సమాజంలో చెలామణి అయ్యే విలువలను, విశ్వాసాలను, అభిప్రాయాలను, జీవన రీతులను ఆదరించి, ఆచరించితే చాలని వీరు అనుకొంటుంటారు. వీటిసాయంతో ముందుకెదగాలని నిరంతరం ఆలోచించగలవారు, గత అనుభవాలకు తమ మేధాశక్తిని జోడించి, నూతన అనుభవాన్ని ఆవిష్కరించగలవారు మాత్రమే సమాజ గమనంతో పాటు మందుకు సాగకల్గుతారు.

క్రొత్తగా ఆలోచించాల్సిన, నూతన మార్గాలు అన్వేషించవలసిన అవసరాన్ని ఎవరికి వారు కల్పించుకోవాలి. అలా కల్పించుకోనివారు గతానుభవాల పరిధిలోనే మిగిలిపోతుంటారు. ఈ పరిధిలో వుండిపోతే అందరి అభినందనలు లభించవచ్చు. ప్రతి అంశాన్ని గురించి క్రొత్తగా ఆలోచించడానికి అలవాటు చేసుకొన్న వారు మాత్రమే తాము తాజాగా ఆలోచించుతున్నామో, గతకాలపు ఆలోచనలనే ఆదరిస్తున్నామో గుర్తించగలరు. మన ఆలోచనలన్నింటికీ పూర్వాభిప్రాయాలు, గతానుభవాలు ఎలా పరిమితులు విధిస్తుంటాయో ఎప్పటి కప్పుడు గుర్తించడానికి ఈ గ్రంథం తోడ్పడుతుంది. ప్రతి అంశాన్ని గురించి

క్రొత్తగా ఎలా ఆలోచించాలో తెలియజెబుతుంది.

ఎప్పటికప్పుడు నూతనంగా ఎదురయ్యే అనుభవాల సాయంతో మన ఆలోచనలను, మన దృక్పథాన్ని, ప్రవర్తనా సరళిని నిరంతరం మెరుగుపరచు కొంటుంటాము. ఫలితంగా మన ప్రవర్తన ఎప్పటికప్పుడు నూతనంగా రూపుదిదు కొంటుంటుంది. చాలకాలం పాటు స్పష్టమైన అభిప్రాయాలతో, ఒకే రకమైన ప్రవర్తనను ఆశ్రయించుకొన్న మతబోధకులు తమ ఆలోచనలన్నింటిని మార్చుకొని సంసార జీవితంలోకి ప్రవేశించడమే ఇందుకు చక్కటి ఉదాహరణ. వారు అతి త్వరలోనే నూతన ఆలోచనా ధోరణిని, జీవన విధానానికి సర్దుకు పోకల్గుతారు. గతంలో ఇలా ప్రవర్తించామా అని ఆశ్చర్యపోతుంటారు.

మనందరం మన ఆలోచనలను, ప్రవర్తనను మార్చుకొన్నంతటి సులభంగా మనలో జనించే ఉద్రేకాలను, ఉద్వేగాలను, అనేక శారీరిక స్పందనలను నియంత్రించుకోలేము. మార్చుకోలేము. శారీరిక ఉద్వేగాలు అనేక సందర్భాలలో మన మనస్సులను, ఆలోచనలను అతిబలమైన రీతిలో ప్రభావితం చేస్తుంటాయి. ఒక యువతి తన ప్రియుని పొందు కోసం, జీవితంలో సర్వం కోల్పోవడానికి సిద్ధపడుతుంది. ఒక యువకుడు లైంగిక సుఖం పొందడానికి ఎయిడ్స్ బారిన పడి జీవితం సర్వనాశనం అయ్యే ప్రమాదాన్ని కూడా ఖాతరు చేయడు. అనేక ఉద్వేగాలు ఆలోచనలను స్తంభీభూతం చేస్తుంటాయి. అయినా ఈ ఉద్రే కాలను, ఉద్వేగాలను ప్రయత్నపూర్వకంగా నియంత్రించుకోగల, వాటి ప్రభావాన్ని త్రోసిరాజనగల సౌలభ్యం మానవజాతి కొక్కదానికే వుంది.

తీవ్రమైన శోధనలో నిమగ్నమైన పరిశోధకుడు తన ఆకలి, నిద్రవంటి తక్షణావసరాలను కూడా పట్టించుకోకపోవచ్చు. తమ విద్యావ్యాసంగంలో తలమునకలయ్యే యువతీ, యువకులు, తమలో విచ్చలవిడిగా చెలరేగే లైంగిక స్పందనలనే గుర్తించకపోవచ్చు. తమ ఆలోచనలన్నింటినీ ఒకే అంశంపై నిలిపితే, ఆ ఏకాగ్రత తపస్సుగా మారి అద్భుతమైన ఫలితాలను సృష్టిస్తుంది. తాము కోరిన రంగంలో, తమ కృషిని ఒక తపస్సులా చేపట్టడమెలాగో ఈ గ్రంథం వివరిస్తుంది. ఏ అంశాన్నయినా తపస్సులాగా చేపట్టినప్పుడే, సహజమైన ఉద్వేగాల ప్రభావంనుండి ఎవరైనా బయటపడగలరు. తాము చేపట్టిన పనిని యధాలాపంగా తీసుకొనేవారిని, తమ మదిలో జనించే ఉద్రేకాలు నిరంతరం ప్రక్క త్రోవపట్టించబోతాయి.

వేలసంవత్సరాల పాటు మానవజాతి తమ కనీస మనుగడకోసమే తీవ్ర పోరాటం సాగించాల్సి వచ్చింది. ఆ భయంకర అనుభవాలు మన జ్ఞాపకాలలో ఇంకా సజీవంగా నడయాడుతున్నాయి. భయం, అభద్రతా భావన ఇంకా మానవ జాతిని వీడని దుస్వప్నాలుగా మిగిలివున్నాయి, ఎన్ని కష్టాలెదురవుతున్నా, కొద్దిపాటి భద్రతా భావన లభించితే, యథాతథస్థితితో సర్దుకుపోవడానికి అత్యధిక శాతం మంది సిద్ధంగా వుంటారు. అందుకే తమకు పరిచయమున్న పరిసరాలనుండి ప్రక్కకు తప్పుకోవడానికి ప్రయత్నించరు. అసౌఖ్యం, అనిశ్చితి, అన్నింటికీమించి అభద్రతా భావన, అలవాటయిన జీవితానికి అంటిపెట్టుకొనేలా చేస్తాయి. ఫలితంగా, నూతన అంశాల పట్ల, నూతన సన్నివేశాల పట్ల, ప్రతికూల భావనల మధ్య బందీలుగా మారి, చాల మంది స్తబ్ద జీవితానికి అంకితమైపోతుంటారు. ఈ స్తబ్దతను బ్రద్దలు చేయడానికి ఈ గ్రంథం తోడ్పడుతుంది. యథాతథ స్థితితో రాజీపడిపోతూ జీవించడం వలన ఒనగూడే భద్రత ఎంతటి కృత్రిమమైనదో విశదపరచుతుంది. క్రొత్త పుంతలు తొక్కేప్పుడు ఎదురయ్యే అనిశ్చితి, అభద్రతా భావనలను ఎదుర్కోవడాన్ని ఒక ఉత్తేజకర అనుభవంగా మార్చివేస్తుంది.

'వ్యక్తిత్వ వికాసం' కు సంబంధించిన ప్రామాణిక గ్రంథాలను లక్షలాది మంది చదువుతున్నారు. ఇది చదివిన వారందరిలోను కొట్టవచ్చిన రీతిలో తేడా ఎందుకు కనిపించడంలేదు? వీరు సైతం అన్ని సందర్భాలలో ఇతరులలాగే ఎందుకు ప్రవర్తించుతున్నారు? వ్యక్తిత్వ వికాసపు మూలసూత్రాలను ఆకళింపు చేసుకొన్నవారుకూడా, వీటిని తమ దైనందిన జీవితానికి అన్వయించుకోవడానికి ప్రయత్నిచండంలేదు. ఆరోగ్య సూత్రాలన్నీ తెలిసికూడా, వాటిని పాటించకుండా వుంటే ప్రయోజనమేంవుంటుంది.

స్వంత జీవితానికి ఈ మూలసూత్రాలను ఎందుకు అన్వయించు కోలేక పోతున్నారని, నిశితంగా పరిశీలించితే అందరివద్దా ఒకే కారణం కనిపిస్తుంది. తమపట్ల తమ మదిలో జీర్ణించుకుపోయిన అపనమ్మకం! తెలిసీతెలియని వయస్సులో ఇతరులందరి ప్రభావంతో, ప్రపంచంలో తాము నిర్వహించాల్సిన పాత్రేమిటో తమ మదిలో బలంగా ముద్రించుకొంటారు. అతి పరిమితమైన పాత్రకు తమను తాము పరిమితం చేసుకొంటారు. ఇంకా ఉన్నత స్థాయిని అందుకోవచ్చని తమ శక్తి సామర్థ్యాలను ఎంతగానో పెంచుకోవచ్చని అందరూ గుర్తించకల్గుతారు. కాని అందుకు తగిన కృషి చేయకుండా మనస్సులో

తిష్టవేసిన అపనమ్మకం ఎప్పటికప్పుడు అడ్డుకొంటుంది. నీ పట్ల పూర్తి విశ్వాసాన్ని పెంపొందించుకోమని' ఎవరెన్ని చెప్పినా, వారికి ఆ విశ్వాసం కలుగదు. పూర్తి ఆత్మవిశ్వాసాన్ని సంతరించుకోకుండా, తమ మనస్సులో పీఠంవేసిన అపనమ్మకమే రాజ్యమేలుతుంది.

వీరు ప్రతికూల భావనలకు బందీలుకారు. అందరికీ మంచి సలహాలు ఇస్తుంటారు. అందరిలో ధైర్యం నూరి పోస్తారు. ఎవరైనా ఎంతటి స్థాయికైనా ఎదగవచ్చని అనేక ఉదాహరణలు చెబుతారు. తీరా తమవద్దకు వచ్చే సరికి ఉన్నతంగా ప్రవర్తించడానికి వెనుకాడతారు. ఎందువలన?

ఎన్నో దశాబ్దాలుగా మదిలో పేరుకుపోయిన అపనమ్మకం ఒక్కసారిగా తొలగిపోదు, క్రమక్రమంగా అది బలహీనంకావాలి. కొంతకాలానికి అంతర్ధానం కావాలి. అంటే ఎప్పటికప్పుడు తమకు అలవాటైన ధోరణిలో కాకుండా, తాము ఆశించిన రీతిలో ప్రవర్తించే చొరవ తీసుకొంటే ఎప్పటికప్పుడు సత్ఫలితాలు, కన్పిస్తాయి. ఇలా ఎప్పటికప్పుడు కన్పించే మంచి ఫలితాలు, మరింత చొరవ తీసుకోగల శక్తిని కల్పిస్తాయి. తాము కోరుతున్న రీతిలో ప్రవర్తించే చొరవను ప్రతి సందర్భంలోనూ తీసుకోవడం క్రమంగా అలవాటవుతుంది. ఇలా చొరవ తీసుకోవడం ద్వారానే వ్యక్తిత్వ వికాస మూలసూత్రాలను తమ జీవితానికి అన్వయించుకోవడం సాధ్యపడుతుంది. జీవితాన్ని ఉన్నతంగా రూపొందించడానికి ఆ సూత్రాలు ఎంతటి ముఖ్యమో, మనం ఎప్పటికప్పుడు తీసుకోవలసిన చొరవ కూడా అంతే ప్రధానం.

ప్రతి ఒక్కరూ, తమ జీవితంలో విజయపథంలోకి ప్రవేశించడమెలాగో ఈ గ్రంథం వివరిస్తుంది. జీవితంలో విజయం సాధించడంపట్ల అనేక పుస్తకాలు తేలిక భావాన్ని కలిగిస్తున్నాయి. విజయాన్ని చాలమంది సంకుచితంగా అర్థం చేసుకొంటున్నారు. సంపదను కూడబెట్టడం, ఒక ఉద్యోగమో, ఆ ఉద్యోగంలో ప్రమోషన్ పొందడం, లేదా లాభదా యకమైన వ్యాపారం చేయడం వరకే విజయాన్ని పరిమితం చేసు కొంటున్నారు. జీవితంలో విజయం ఒక గమ్యంకాదు. అది ఒక మార్గం. విజయపథంలోకి ప్రవేశించడం జీవితాన్ని అర్థవంతం చేసుకోవడం. ఈ గ్రంథం ప్రతిఒక్కరినీ విజయపథంలోకి ప్రవేశపెడుతుంది.

వ్యక్తిత్వ వికాసపు మూలసూత్రాలు సంపదకూడబెట్టడానికి, పేరు

ప్రఖ్యాతులు పొందడానికి అడ్డ త్రోవలుగా ఉపయోగపడతాయని చాల మంది తప్పుగా భావిస్తుంటారు. నేనింతకు ముందు వెలువరించిన 'వ్యక్తిత్వ వికాసం' గ్రంథం చదివిన వారికెవరికీ ఇటువంటి భ్రమలు వుండవు. వ్యక్తిత్వ వికాసపు నిజసూత్రాలన్నీ ఉన్నతంగా ఎదగడానికి, జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దు కోవడానికి, ఎదగడానికి నిరంతరం, సృజనాత్మకంగా క్రొత్తగా ఆలోచించడానికి, సమాజంతో, తోటి వ్యక్తులతో గాఢమైన అనుబంధాన్ని పెంపొందించుకోవడానికి, నిరంతరం ఆహ్లాదకరంగా గడపడానికి, అందరి జీవితాలను ప్రకాశవంతం చేయడానికి మాత్రమే తోడ్పడతాయి.

తమ జీవితాన్ని సమగ్రంగా, సమున్నతంగా రూపొందించుకోవడానికి 'విజయపథం' గ్రంథం ఎంతగానో ఉపకరిస్తుంది. నిజ జీవితం అత్యంత సంకీర్ణంగా, సంక్షిష్టంగా వుంటుంది. ఎప్పటికప్పుడు చేకూరే అనుభవాలన్నీ క్రొత్తగా, అంతుపట్టనివిగా అనిపిస్తుంటాయి. గతంలో నేర్చుకొన్న గుణపాఠాలకు సంబంధం లేని నూతన పరిణామాలు ఎదురవుతున్నప్పుడు ప్రతిఒక్కరూ ఏంచేయాలో తోచని నిశ్చేష్టతకు లోనవుతుంటారు. ఈ కీలక సన్నివేశంలోనే 'విజయపథం' గ్రంథం చేదోడు వాదోడుగా వుంటుంది. ఎంతటి క్లిష్టమైన నూతనానుభవం ఎదురైనా, వ్యక్తిత్వవికాసపు మూలసూత్రాలను, అప్పుడు ఏ రీతిలో అన్వయించుకోవాలో, ఎటువంటి నిర్ణయం ప్రయోజనదాయకంగా వుంటుందో తెలియజెబుతుంది.

ఎన్నెన్నో విభిన్న జీవన రీతులను నిశితంగా పరిశీలించి, విలక్షణ ఆలోచనా ధోరణులు అవగతం చేసుకొని వారందరి అనుభవాలను ఈ గ్రంథంలో క్రోడీకరించడం జరిగింది. ఇవన్నీ 'ఈనాడు' ఆదివారం సంచికలో ప్రచురితమయ్యాయి. సంవత్సరాలకాలం పాటు వీటిని వ్రాయడం వలన నాకు మానవ జీవితాన్ని విస్తృతంగా, విభిన్న కోణాలనుండి పరిశీలించగల సౌలభ్యం కలిగింది. ఈ అనుభవాలన్నింటినీ వ్యక్తిత్వ వికాసపు మూలసూత్రాల సాయంతో పరామర్శించడం నిజంగా ఒక ఉత్తేజకర అనుభవం. అందుకే ఈ గ్రంథం పాఠకుల జీవితానుభవాలను ఉత్తేజితం, సుసంపన్నం, ప్రయోజనకరంగా మలుస్తుందని ఆశిస్తూ ఈ గ్రంథాన్ని సమూలంగా చదివినతరువాత మీ తక్షణ అభిప్రాయాన్ని తెలిపితే ఎంతో సంతోషిస్తాను.

– సి. నరసింహారావు

408, విజయాటవర్స్,
శాంతినగర్, హైదరాబాద్ – 500028.
సెల్ : 98661-81388

విజయం, జీవన వికాసం

నేటి విలువలు, విజయాలు, గొప్పదనాలన్నీ గతకాలంలో నిర్దేశించబడినవి. గతకాలంలోని నిర్దేశనలకనుగుణంగా ప్రవర్తిస్తున్న వారందరికీ ఇవి సరైనవిగానే కనిపిస్తుంటాయి. గతకాలపు అభిప్రాయాలు ఏం చెబుతుంటాయి? సంపదను కూడబెట్టుకోవడం విజయం. పేరుప్రఖ్యాతులు పొందడం విజయం. సామాజిక హోదా లభించడం విజయం. కోట్లాదిమంది జీవన పథ విజయాన్ని నిర్దేశించడానికి ఒక అయిదారు మార్గాలు ఏర్పరచి, విజయాన్ని కోరేవారందరూ ఆ మార్గాలలోనే పయనించి తీరాలన్న నిర్బంధాన్ని విధించే సమాజం ఇంకా అనాగరిక ప్రవృత్తిని, మూక మనస్తత్వానే ఆశ్రయించుతోంది.

వర్తమాన సమాజంలో ప్రతి ఒక్కరినీ విశిష్ట వ్యక్తులుగా గుర్తించగల సంస్కారం అలవడిన రోజున విజయానికి నేడు నిర్దేశించే ప్రమాణాలు పూర్తిగా మారిపోతాయి. ఇంకొక అర్ధ శతాబ్దానికి, ప్రపంచ ప్రజలందరూ విద్యావంతులు కావడమేకాదు. జ్ఞానవంతులవుతారు. సమాచార విప్లవం తారస్థాయికి జేరుకొని, ప్రపంచమంతా ఏకసమాజంగా రూపొందుతుంది. వేలాది సంవత్సరాలుగా పీడించిన అభద్రతాభావన నుండి మానవజాతి విముక్తి పొందుతుంది. అప్పుడే దారిద్ర్య భయంకూడా మానవజాతిని విడనాడుతుంది. దారిద్ర భయం లేనప్పుడు ఏ ఒక్కరూ, వీలయినంతటి అధిక సంపదను కూడబెట్టడమే తమ ఏకైక లక్ష్యమని చెప్పబోరు. అయినా అలా చెప్పేవారెవరైనా

అప్పుడు కూడా మిగిలివుండి, సంపదకోసం తాపత్రయపడుతుంటే, అటువంటి వారిని ఇప్పుడు రోడ్ల ప్రక్కన చిత్తుకాగితాలు ఏరుకొనేవారిని ఏవగించుకొన్నట్లు, పరిహాసాస్పదమైన వ్యక్తులుగా చూస్తారు.

పేదరికాన్నుండి సంపన్న సమాజంగా పరివర్తన చెందుతున్న వర్తమాన సమాజంలో ఎదురయ్యే తాత్విక సంక్షోభం మనకు అన్నిచోట్లా కనిపిస్తోంది. ధనస్వామిక విలువల నేపథ్యంలో, వాటి ప్రభావంతో తమ నిజ అభిలాషలు, అసలు లక్ష్యాలు, స్వతంత్రత, ప్రతిభా సామర్థ్యాలను విడనాడి, సంపదను కూడబెట్టే యాంత్రిక జీవనం ప్రతిఒక్కరికీ వెగటు కలిగిస్తోంది. అయినా ఆ కృత్రిమ జీవన విధానాన్ని విడనాడలేని నిస్సహాయతను మన యువతరం కనపరుస్తోంది.

పరిణామక్రమంలో మానవజాతి ,జంతు జాలం నుండి విడివడి శక్తివంతమైన మేధస్సుతో ఉన్నత స్థాయికి ఎదిగింది, గుంపు స్వభావంనుండి బయటపడి, వైయుక్తిక స్వభావాన్ని సంతరించుకోగల స్థితికి, ప్రతి ఒక్కరూ స్వతంత్రంగా ఆలోచించగల, విశిష్టంగా వ్యవహరించగల స్థితికి జేరింది. ఈ విశ్వానికే నూతన పార్శ్వంగా ఎదిగింది. తమకు క్రొత్తగా అలవడిన అద్భుత శక్తి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా, శతాబ్దాలుగా అలవాటయిన మూక మనస్తత్వానికి, ఇతరులతో పోల్చిచూసుకొని తమ జీవన మార్గాన్ని ఎంచుకొనే స్థితికి ఇప్పటికి అంటి పెట్టుకు వుండడం మానవజాతికే ఒక పెనుశాపం. కాని మన జీవితాలు ఈ రోజులో, ఈ సంవత్సరంలో, ఈ శతాబ్దంలో ముగియడంలేదని గుర్తించకలిగిన వారు, భవిష్యతులో సమాజం ఎలా మారనున్నదో గుర్తించకలుగుతారు. రేపటి అవసరాలకు అనుగుణమైన రీతిలో నేటి జీవనాన్ని సరిదిద్దుకోవాలని, రూపొందించుకోవాలని, అవగతం చేయడానికి ఈ అధ్యాయం అంకితమయ్యింది. గతంలోకి తొంగిచూడవద్దు. గతకాల ప్రభావాలతో ఆలోచించవద్దు. ప్రవర్తించవద్దు. భవిష్యత్తును పరిలోకించండి. అప్పుడే విజయపథంలోకి అడుగిడతారు.

జీవనగమనంలో నిరంతరం తమ ప్రతిభా విశేషాలను, శక్తి సామర్థ్యాలను పెంపొందించుకొంటూ ఎప్పటికప్పుడు తమ చుట్టూ ఆవిష్కృతం కానున్న నూతన అవకాశాలను కనుగొనడమే విజయం సాధించడం. ఇది నిరంతర ప్రక్రియ.

విజయమంటే ఏమిటి?

అసలు జీవితంలో విజయం సాధించడమంటే ఏమిటి? మనదేశంలో అత్యధికశాతం మంది చెప్పే సమాధానం ఒక్కటే! వీలయినంతటి ఎక్కువ సంపదను కూడబెట్టడం! లేమి మనస్తత్వంతో బాధింపబడేవారంతా సంపదను కూడబెట్టడంకోసం నిరంతరం తపన చెందుతుంటారు. సంపద కూడబెట్టడాన్ని లక్ష్యంగా ఎంచుకొన్నవారు తాము కోరినంతటి సంపదను ఏనాటికీ కూడబెట్టలేరు. తమ జీవన వ్యాసంగంలో అమిత ప్రతిభను కనబరచిన వారి వద్ద మాత్రమే, వారు కోరుకోకపోయినా అమిత సంపద సమకూడుతుంది.

మరి అసలు విజయం సాధించడమంటే ఏమిటి? జీవనగమనంలో నిరంతరం తమ ప్రతిభా విశేషాలను, శక్తి సామర్థ్యాలను పెంపొందించుకొంటూ ఎప్పటికప్పుడు తమ చుట్టూ ఆవిష్కృతం కానున్న నూతన అవకాశాలను కనుగొనడమే విజయం సాధించడమని, ఇది నిరంతర ప్రక్రియ అని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఈ కీలకఅంశాన్ని గుర్తించకుండా సంపద వేపు దృష్టిని సారించేవారు తమ జీవితంలో సాధించకలిగిన అనేక విజయాలను చేజేతులా జారవిడుచుకొంటారు.

అనురాగపూరితంగా, అన్యోన్యంగా, పారదర్శకంగా తమ జీవితాన్ని గడుపుతూ, తమ పిల్లల వికాసం కోసం కృషి చేయడమే దంపతులకు విజయం. పాఠ్యాంశాలన్నింటినీ కూలంకషంగా అవగతం చేసుకొంటూ తన మేధస్సును, ప్రతిభను నిరంతరం పెంపొందించుకోవడమే విద్యార్థికి విజయం. తన వైద్యసేవలతో ఎక్కువ మంది ప్రాణాలు కాపాడడమే వైద్యునికి విజయం. అనేక చిక్కులలో చిక్కుకున్న వారికి సరైన న్యాయం జరిగేట్లు చూడడమే న్యాయవాదికి విజయం. తన విద్యార్థుల మనోవికాసానికి తోడ్పడుతూ, వారిలో బలమైన ఆత్మవిశ్వాసాన్ని కలిగించడమే అధ్యాపకుడి విజయం. నిస్సహాయులకు రక్షణ కల్పించడమే పోలీసు అధికారికి విజయం. ప్రభుత్వ సొత్తును ఏ ఒక్కరూ అక్రమంగా కాజేయకుండా కాపాడుతూ, తన ఉద్యోగనిర్వహణలో సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వాధికారికి విజయం. పేదరికాన్ని, నిరక్షరాశ్యతను పారద్రోలడానికి, సమగ్ర సమాజ ప్రగతికి నిరంతరం కృషి చేయడమే రాజకీయవాదికి విజయం. ప్రజలందరి సంక్షేమం కోసం మానసిక ప్రశాంతత కలిగించడం కోసం అంకితభావంతో పనిచేయడమే మతాధికారికి విజయం. ఈ సమాజంలో తోటివారిని ప్రేమించడం, తిరిగి అందరి ప్రేమాభిమానాలు పొందడమే వ్యక్తికి విజయం. అలాగే స్వీయ గౌరవాన్ని మదినిండా నింపుకొని ఇతరులందరిని గౌరవించడమే విజయం.

నిజమైన విజయాలు సాధించిన వారని, ప్రపంచంలో మనం కొనియాడే వారెవ్వరూ తమ సంపదపై దృష్టిని నిలిపినవారు కాదు. దయానిధి ఒక కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఇరవై సంవత్సరాలు పనిచేశాడు. ఆయన తన విద్యార్థులందరినీ ఎంతగానో ప్రేమించేవాడు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని రగుల్కొలిపేవాడు. చదువులో వెనుకబడినవారిని తిరిగి అగ్రస్థానానికి తీసుకురావడానికి నిరంతరం కృషి చేసేవాడు. అధ్యాపకుల్లో, బోధించడం పట్ల అమిత ప్రేరణ కలిగించేవాడు. అలాగే తన దగ్గర చదువుకొన్న వారికి జీవితంలో వున్న అవకాశాలను గురించి వివరించేవాడు. వారిలో అనేకమంది అయ్యేఎస్ ఆఫీసర్లు కావడానికి ఈయన ప్రోద్బలమే కారణం. ఈయన దగ్గర చదువుకొన్న వేలాదిమంది ఉన్నతస్థాయికి ఎదిగారు.

దయానిధి పదవి విరమణ చేసిన తరువాత ఆయన స్వంతానికి ఏం సంపాదించుకోకల్గారని భార్య ప్రశ్నించడం ప్రారంభించింది. అలాగే స్వంత ఇల్లు కూడా కట్టలేని ఆయన చేతకానితనాన్ని పిల్లలు కూడా ప్రతిసారీ దెప్పిపొడవడం మొదలుపెట్టారు. సన్నిహిత బంధువులు కూడా ఆయన్ను తప్పుపట్టసాగారు. అప్పట్లో ఒక రెండు నెలల జీతానికి ఇక్కడ ఎకరం పొలం వచ్చేది. అప్పుడు కొని వున్నట్లయితే ఇప్పుడు రెండు కోట్లు వచ్చేవి. వంటి వ్యాఖ్యానాలు చేసేవారు. పూర్వ విద్యార్థి ఎవరైనా వచ్చి తానెంత సంపాదించకలిగానో చెబుతుంటే అది విన్న కుటుంబసభ్యులు మరీ రెచ్చిపోయి దయానిధిని అవమానపరచేవారు. ఆయన ప్రతిరోజూ ఈ అవమానాల్ని ఎదుర్కోలేక మానసికంగా క్రుంగిపోయాడు. దయానిధికి ఏం చెయ్యాలో తోచలేదు, తన బాల్యమిత్రుడు తనతోపాటు చదువుకొని గ్రామంలో రైతుగా స్థిరపడ్డ సత్యంను రమ్మని ఫోను చేశాడు. అతను వచ్చిన తరువాత, తాను కుటుంబసభ్యులు పెట్టే మానసిక హింసను భరించలేకపోతున్నానని, తన జీవితంలో ఎటువంటి అసంతృప్తి లేదని, ఇప్పుడిలా ప్రతి నిమిషం కుమిలిపోవడం కంటే ఆత్మహత్య చేసుకొని హుందాగా జీవితాన్ని చాలించాలని వుందని, తానేం చెప్పినా తన కుటుంబసభ్యులు వినిపించుకొనే స్థితిలో లేకపోవడంతో తానీ నిర్ణయానికి వచ్చానని, వివరించి చెప్పాడు.

సత్యం మరుసటి రోజు కుటుంబసభ్యులందరినీ సమావేశపరిచాడు. ప్రశాంత

వాతావరణంలో వాళ్ళకిలా చెప్పాడు. "మేమంతా వెనుకబడిన ప్రాంతంలోని ఓ కుగ్రామంలో జన్మించాం. దయానిధి అనేక కష్టాలను ఎదుర్కొంటూ స్వంత కృషితో ఉన్నత చదువులు చదివాడు. ప్రతిక్లాసులోను అగ్రస్థానంలో నిలిచేవాడు. తనకు కేవలం సలహా చెప్పేవారు కూడా లేకపోవడం వలన తానెన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాడో గుర్తించి దయానిధి తన దగ్గర చదువుకొన్న వారికందరికీ జీవితంలో పైకి ఎదిగే మార్గాన్ని చూపాడు. దశాబ్దాల తరబడి వేలాదిమంది జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దాడు. తన జీవితకాలంలో వేలమంది జీవితాల్లో విజయాలను సృష్టించకలిగాడు. దయానిధి ప్రేరణతో, ప్రోద్బలంతో తమ తమ జీవితాల్లో సంభవించిన విజయాలకు సృష్టికర్త ఆయనేనని ఇప్పటికీ వేలాదిమంది నమ్ముతున్నారు." అని సత్యం కొంతసేపాగి "మీకందరికీ కోట్లాది రూపాయలు ఇచ్చినా మీరు ఇంతమంది జీవితాల్లో అద్భుతమైన మార్పు తేగలరా? కనీసం ఒకరిద్దరి జీవితాల్లో అయినా మార్పు తేగలరా? మీరు రోజూ మీ మాటలతో తనను ఎలా వేధిస్తున్నారో దయానిధి నాకు చెప్పాడు. మీ ప్రశ్నలు, మీ వ్యాఖ్యానాలు నాకు హాస్యాస్పదంగా అనిపించాయి. కొలంబస్ వారసులు, కొలంబస్ అమెరికాలో తమకేం ఆస్తులు సంపాదించి పెట్టాడని ప్రశ్నించితే ఎలా వుంటుంది? మీ వాలకం కూడా నాకు అలాగే అనిపిస్తోంది. దయానిధి దశాబ్దాలపాటు తన ప్రవర్తన ద్వారా ఇచ్చిన తన జీవనసందేశాన్ని మీరెవ్వరూ అర్థం చేసుకోకపోవడం మీ ఘోరమైన వైఫల్యం. ఇందుకు మీరంతా సిగ్గుతో తలదించుకోవాలి." అని సత్యం తనను తాను తమాయించుకొని ఇలా చెప్పాడు. "అతి పేద కుటుంబంలో జన్మించినా దయానిధిలో లేమి మనస్తత్వం లేదు. అందుకే వాడు సంపదల కోసం ఎన్నడూ ఆరాటపడలేదు. పుట్టిన నాటినుండి మీకు అన్ని సౌకర్యాలు, అన్ని అవకాశాలు వున్నా, దురదృష్టవశాత్తూ లేమి మనస్తత్వం మీలో చోటు చేసుకొంది. అందుకే సంపదపై మీకింతటి వ్యామోహం. ఆ సంపద కోసం మీకింతటి ఆరాటం. లేమి మనస్తత్వం అనేది ఒక భయంకరమైన మానసిక అంటువ్యాధి. ఈ వ్యాధి మీ కందరికీ సోకిందని, దయానిధి ముందుగానే గుర్తించి, ఆ వ్యాధిని నిర్మూలించకపోవడం మాత్రమే అతను తన జీవితంలో చేసిన ఏకైక పొరపాటు. నేనెంతగా చెప్పినా, మీ మనస్సుల్లో గాఢంగా పాదుకుపోయిన లేమి మనస్తత్వాన్ని వైదొలగించుకోకలిగినప్పుడు మాత్రమే, నేనెంతో గర్వంగా చెప్పుకొనే దయానిధి గొప్పతనం మీకు అర్థమవుతుంది."

వర్తమాన సమాజంలో ఈ లేమి మనస్తత్వాన్ని జీర్ణించుకొన్నవారు అన్ని స్థాయిల్లో, అన్ని రంగాల్లో వున్నారు. ప్రఖ్యాత రచయితలు, నటులు, దర్శకులు, పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలు, ఉన్నతాధికారులు, రాజకీయవేత్తలు కూడా తమ స్వంత వ్యక్తిత్వాన్ని, తమ జీవితపరమార్థాన్ని విస్మరించి, లేమి మనస్తత్వంలో ఇరుక్కుపోయి సంపదపట్ల వెర్రి వ్యామోహాన్ని ప్రదర్శించవచ్చు. ఇటువంటి వారంతా డబ్బు లేకపోతే విలువేముందన్న తర్కానికి దిగవచ్చు. సంపదపట్ల వ్యామోహంతో తమ జీవితాలను రూపొందించుకొన్నవారెవరూ తమ జీవితాల్లో రాణించలేదని, తోటి సమాజానికి తోడ్పాటునందించాలనుకొనే వారి వద్దకే అధికంగా సంపద జేరిందన్న వాస్తవాన్ని వీరు గుర్తించలేకపోవచ్చు. నేటి యువతరం, అటువంటి త్రోవ తప్పినవారిని ఆదర్శంగా తీసుకోవడం తప్పు. పొరపాటు ఆలోచనలతో నిరర్థకజీవితాలు గడిపిన వారి నుండి గుణపాఠాలు గ్రహించాలి. తమ జీవితాలను అర్థవంతంగారూపొందించుకోవాలి. విజయసాధనను నిరంతర జీవనగమనంగా మార్చుకోవాలి. □

అత్యంత క్లిష్టస్థితిలో కూడా ధైర్యాన్ని విడనాడినప్పుడు ఒక అద్భుతం చోటు చేసుకుంటుంది. ధైర్యం లేనివారు ఆ సమస్యను తలచుకొని తల్లడిల్లిపోతూ, ఏమీ చేయలేని స్తంభనకు లోనవుతుంటే, ధైర్యవంతులు ఆ సమస్యకు అతి సృజనాత్మకమైన పరిష్కారం గురించి ఆలోచిస్తారు. అలా ఆలోచించే వారికి ఎప్పుడూ నూతన అవకాశాలు లభిస్తాయి.

విజయపథంలోకి ప్రవేశించడమెలా?

విజయపథంలో పయనించేవారు, అందరూ పెద్దగా పట్టించుకోని లక్షణాలను తమ అలవాట్లుగా మార్చుకొంటారు. సృజనాత్మకంగా ఆలోచించడం కేవలం కవులకు, రచయితలకూ మాత్రమే పరిమితమని అందరూ అనుకొంటుంటారు. కానీ విజయసాధకులు మాత్రం నిరంతరం సృజనాత్మకంగా ఆలోచించడాన్ని ఒక అలవాటు చేసుకొంటారు. ఏదైనా ఒక లక్ష్యాన్ని జేరుకోవాలంటే తక్షణమే ఏవో రెండు మూడు మార్గాలను గురించే అత్యధికశాతం మంది ఆలోచించుతారు. వారి ఆలోచనలు అక్కడే ఆగిపోతాయి. స్పష్టంగా కొన్ని మార్గాలు కన్పించుతున్నప్పుడు వారు ఇంకా ఏ మార్గాలు వున్నాయని ఆలోచించడానికి పూనుకోరు.

ఏ లక్ష్యాన్ని చేరుకోవడానికైనా అందరికీ తెలిసిన రెండు మూడు మార్గాలు మాత్రమే కాకుండా ఇతర మార్గాలను అన్వేషించాలనుకొన్నప్పుడే వారి విజయగమనం మొదలవుతుంది. అలా గొప్ప విజయాలు సాధించడానికే కాదు. దైనందిన జీవితంలో కూడా కొద్దిపాటి

సృజనాత్మకత అద్భుతఫలితాలనిస్తుంది. భానుమూర్తి వ్యాపారంలో బాగా నష్టపోయాడు. పెద్ద కూతురుకు తాను వాగ్దానం చేసిన కట్నాన్ని ఇవ్వలేకపోయాడు. తాను ఉద్యోగం మానివేసి వ్యాపారరంగంలో ప్రవేశించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకొన్నానని, ఇప్పుడు అందుకు తగిన పెట్టుబడి లేకపోతే తన భవిష్యత్తు అంధకారమవుతుందని అతని అల్లుడు తన భార్యను పుట్టింటికి పంపించివేశాడు. పెళ్ళయిన కూతురు తమ ఇంట్లో వుండడం వలన తలెత్తుకోలేకపోతున్నామని, చుట్టుప్రక్కలవారికి చెప్పుకోలేకపోతున్నామని భానుమూర్తి భార్య నిత్యం అతన్ని సాధించేది. వాగ్దానం చేసిన కట్నం ఇవ్వగల స్థోమతుగాని, ఎక్కడైనా అప్పులు చేయగల స్థాయిగాని తమకు లేదని, కూతురు జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకొన్నామని ఆమె నిత్యం విలపించేది. భాను మూర్తి తన అల్లుడుకు ఫోను చేసి అతను అనుకున్నట్లు వ్యాపారాన్ని ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లన్నీ చేశానని, అతన్ని ఆహ్వానించాడు. అతను తనకిచ్చిన ప్రాజెక్టు రిపోర్టును తన బాల్యమిత్రుడైన చార్టర్ ఎకౌంటెంట్‌కు చూపించానని అది చాలా బాగుందని చెప్పాడని, అతనే పెట్టుబడి పెట్టగల భాగస్వామిని కూడా చూశాడని వివరించాడు. కట్నం వస్తేనే వ్యాపారం ప్రారంభించాలన్న ఆలోచన దగ్గరే అతను ఆగిపోయాడని, అందుకు భిన్నంగా ఆ వ్యాపారం ప్రారంభించడానికి ఇంకా ఏయే అవకాశాలువున్నాయని తాను ఆలోచించానని భానుమూర్తి తెలియజేశాడు. త్వరలోనే అతని అల్లుడు తాను ఆశించిన దానికంటే పెద్ద స్థాయిలో వ్యాపారాన్ని ప్రారంభించకల్గాడు. కట్నం గురించి మరచిపోయి తన భార్యను వెంటనే తీసుకువెళ్ళాడు.

ఎవరైనా ఒక సమస్య ఎదురైనప్పుడు, దానికి ఇరవైరకాల పరిష్కారాలను కనుగొని తీరాలని అనుకోవాలి. వాటన్నింటినీ ఒక చోట వ్రాయాలనుకొంటే, అందులో మొదటి ఎనిమిది దాదాపు అందరూ ఆలోచించేవే అయి వుంటాయి. తరువాత ఎనిమిది పరిష్కారాలను ఊహించడానికి ఎంతో కష్టపడాలి. ఇక చివరి నాలుగు పరిష్కారాలను ఆవిష్కరించడానికి చాలా కష్టపడాలి. దీనికెంతో సృజనాత్మకత కావాలి. వీటిని అమలుజరపడం అతి క్లిష్టదాయకమనిపిస్తుంది. కాని ఇటువంటి పరిష్కారాన్ని సాధించేదిశగా ముందడుగు వేస్తే అద్భుతఫలితాలు లభిస్తాయి. మానవనాగరికతా పరిణామక్రమాన్ని అతి తీవ్రంగా ప్రభావితం చేసిన మోటారు కారు, విద్యుత్, కంప్యూటర్, ఇంటర్నెట్‌ను కనుగొన్న వారందరూ ఇటువంటి అసాధారణ పరిష్కారాన్ని కనుగొనడానికి ప్రయత్నించిన వారే!

విజయపథంలో పయనించడానికి సృజనాత్మకత మొదటి అంశం. ధైర్యం రెండవ అంశం. జీవితంలో ప్రతి సందర్భంలోను మనకు ప్రయోజనం కలిగించే రీతిలో ప్రవర్తించడానికి ఎంతో ధైర్యం కావాలి. ప్రతి ఉదయం బద్ధకంగా పడుకుని ఆలశ్యంగా నిద్రలేవడం అందరూ చేసేపని. బద్ధకాన్ని వదిలించుకొని, ప్రాతఃకాలాన్నే నిద్రలేచి, వ్యాయామం చేయడానికి, అంటే కొంత సమయంపాటు అసౌఖ్యాన్ని ఆహ్వానించడానికి ఎంతో ధైర్యంకావాలి. ఈ ధైర్యాన్ని సంతరించుకొన్నవారే స్వీయక్రమశిక్షణను అలవరచుకోగలుగుతారు. ఈ స్వీయక్రమశిక్షణను అలవరచుకొన్నప్పుడే మన ఆలోచనలను, ప్రవర్తనను ఉద్రేకాలను, ఉద్వేగాలను సరైన రీతిలో నియంత్రించుకోకలుగుతాము. తమపై తమకు పట్టు లభించినప్పుడే, ఇతరులకు నాయకత్వం వహించడం, ఆదర్శప్రాయులుగా పరిగణించబడడం సాధ్యపడుతుంది. తమ సౌఖ్యాన్ని విడనాడగలిగే ధైర్యం వున్నప్పుడు

మాత్రమే, ఎంతటి పెద్ద సవాలునైనా ఎదుర్కోగల్గడం సాధ్యపడుతుంది. ఏ భయానికి లొంగిపోకపోవడం జరుగుతుంది. అత్యంత క్లిష్టస్థితిలో కూడా ధైర్యాన్ని విడనాడనప్పుడు ఒక అద్భుతం చోటు చేసుకుంటుంది. ధైర్యం లేనివారు ఆ సమస్యను తలచుకొని తల్లడిల్లిపోతూ, ఏమీ చేయలేని స్తంభనకు లోనవుతుంటే, ధైర్యవంతులు ఆ సమస్యకు అతి సృజనాత్మకమైన పరిష్కారం గురించి ఆలోచిస్తారు. అలా ఆలోచించే వారికి ఎప్పుడూ నూతన అవకాశాలు లభిస్తాయి. ఒక భయంకర సన్నివేశాన్ని ఎదుర్కోవడానికి సిద్ధపడిన సమయంలో, అనేక పరిష్కారాలు ఆవిష్కృతమవుతాయి.

విజయపథంలో గమనం సాగించేవారెవ్వరూ ఏ క్షణంలోనూ స్తబ్ధంగా మిగిలిపోరు. నిశ్శబ్దంగా కూర్చోరు. నిరంతరం ఏదో ఒక కార్యాచరణను ఎంచుకొంటారు. ఎప్పటికప్పుడు ఒక ప్రణాళికను రూపొందించుకొని, అందుకు అనుగుణమైన లక్ష్యాలను ఎంచుకొంటారు. ఆ లక్ష్యాలను సాధించడానికి నిరంతరం శ్రమిస్తారు. ఫలితంగా ప్రతిరోజు ఖచ్చితమైన ప్రగతిని సాధిస్తారు. ఒక పనిని అనుకొన్న రీతిలో పూర్తి చేయగానే మరో లక్ష్యాన్ని ఎంచుకొంటారు. ఈ సందర్భంలోనే వారు నిరంతర అభ్యాసకులుగా మిగిలిపోతారు. ప్రతి అనుభవం నుండి తగిన గుణపాఠాలను నేర్చుకోవడానికి సిద్ధపడతారు. నిరంతరం తమను తాము మెరుగుపరచుకోవడాన్ని తమ జీవిత మూలసూత్రంగా స్వీకరిస్తారు. తాము ఎంతగానో ఆశించిన, చేసిన పనులు తరువాత పొరపాట్లుగా రూపుదాల్చవచ్చు. వైఫల్యాలు ఎదురుకావచ్చు. ఇలా వైఫల్యం ఎదురైన ప్రతిసారీ, తమలో ఏ లోపంవుందని, దానిని ఎలా సరిదిద్దుకోవాలని వీరు ఆలోచిస్తారు. ఈ పొరపాట్లు చేయడం వలనే నూతన అంశాలను అవగతం చేసుకోగల అవకాశం లభించిందని వీరు భావిస్తారు. అంతేతప్ప తాము తలపెట్టిన పనిని, తరువాతి పరిణామాలు ఎలావుంటాయోనన్న భయంతో, ఎన్నడూ వదిలి పెట్టరు. తమ ఏకాగ్రతను తాము ఎంచుకొన్న లక్ష్యంపై నిలిపిన తరువాత, తమకు ఎదురయ్యే ప్రతి అనుభవాన్నుండి క్రొత్తగా ఏంనేర్చుకోవాలని వీరు ఎదురుచూడడం జరుగుతుంది. తమ ప్రతి పరిచయాన్ని ప్రతిసంఘటనను, ప్రతి అనుభవాన్ని తాము ఎంచుకొన్న లక్ష్యంనుండి వీక్షించినప్పుడు అనేక నూతన అర్థాలు స్ఫురిస్తాయి.

విజయపథంలో పయనించే వారు, తమ జీవితానికి కర్తలం తామేనని స్పష్టంగా గురిస్తారు. తాము చేసే పొరపాట్లకు, తమకెదురయ్యే వైఫల్యాలకు ఎవరినీ నిందించరు. ఇకపై అటువంటివి తటస్థించకుండా ఏయే జాగ్రత్తలు తీసుకోవాలని ఆలోచించుతారు. ఎప్పుడైతే తమకు ఎదురయ్యే సమస్యలకు ఇతరులను నిందించడం పొరపాటని గుర్తించుతారో, అప్పుడు ప్రతి సందర్భంలోను తామేంచేయాలని ఆలోచించడం సాధ్యమవుతుంది. సృజనాత్మకత, ధైర్యం, అంకితభావం, నిరంతర అభ్యాసం, అన్నింటికీ బాధ్యత వహించడం అన్ని గొప్పవిజయాల వెనుక దాగివుంటాయి. ఏ విజయం ఆయాచితంగా లభించదు. తమకు అనేక మంది అడ్డుగా నిలవవచ్చు. అనేక సందర్భాలలో తీవ్రమైన నిరుత్సాహం కలగవచ్చు. అనుకోని సమస్యలు ఎదురుకావచ్చు. ప్రతి సన్నివేశంలోను బాధ్యతగా వ్యవహరించి తీరాలని నిశ్చయించుకొన్నప్పుడు, ఇతరులుకు తోచని పరిష్కారాలు తమకు లభిస్తాయి. అప్పుడే జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోగల ధైర్యం కూడా అలవడుతుంది. అన్నింటినీ యథాలాపంగా తీసుకొనేవారు ఎన్నటికీ విజయపథంలో అడుగిడలేరు.

□

చిట్టచివరి వరకు కృషి చేయకలిగిన వారికి ఎవరి ప్రమేయమూ, ఎవరి సహాయం లేకుండా అంతిమ పరిష్కారం లభించడం మన మేధానిర్మాణంలో దాగి వున్న ఒక అద్భుతం.

మానవప్రయత్నానికి మించింది లేదు.

ప్రతి ఉదయం ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందికి తమ సమస్యలు గుర్తుకువస్తాయి. తమకు ఎటువంటి పరిష్కారం కన్పించడం లేదని, తమ సమస్యను దేముడే తీర్చాలని తమ మదిలోనే దైవాన్ని ప్రార్థిస్తారు. అప్పుడేమవుతుంది? ఆ సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందా? లభించనే లభించదు. అనేక సందర్భాలలో ఆ సమస్య తీవ్రత, కాలం గడిచేకొద్ది క్షీణిస్తుంది. లేదా తాము ఎదురుచూడని పరిష్కారం లభిస్తుంది. దైవం తమ పక్షాన వున్నాడన్న ఆత్మవిశ్వాసంతో తాము చేపట్టిన కృషి ఫలిస్తుంది.

రామనాథశాస్త్రి అతిసామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి. ఓ పది దుకాణాల్లో అకౌంట్లు వ్రాసుకుంటూ జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నాడు. నెలకు తనకు వచ్చే నాలుగయిదువేల ఆదాయంతో ముగ్గురు పిల్లల్ని అంతంతమాత్రంగానే చదివించగలిగాడు. వాళ్ళు జీవితంలో స్థిరపడాలని ప్రతిరోజూ ఆయన అందరు దేవుళ్ళకు మొక్కుకొనేవాడు. కానీ అనుకోని విధంగా ఆయన్ను అనేక సమస్యలు చుట్టుముట్టాయి. పెద్దకొడుకు తన స్నేహితులతో కలిసి ఒక వ్యాపారాన్ని ప్రారంభించి, అనేక దుర్వ్యసనాలకు లోనయ్యాడు. అంతేకాకుండా పెద్ద వడ్డీలకు అప్పులు చేస్తే ఆ అప్పులిచ్చినవారు ఇంటిమీదకు వచ్చి అతన్ని కొట్టబోతుంటే,

నెలకింతఅని తాను చెల్లిస్తానని ఈయన హామీ ఇచ్చాడు కాని, చెప్పిన విధంగా చెల్లించలేకపోవడంతో, వాళ్ళు వచ్చి కిరాతకంగా మాట్లాడసాగారు. అలాగే పెద్ద కూతురు తనను ఒక వ్యక్తి ప్రేమించి మోసం చేశాడని, తాను గర్భవతినని తెలియజేసినప్పుడు ఈయనకు దిక్కుతోచలేదు. రెండవ కొడుకు పనిచేసే నగలకొట్టులో దొంగతనం జరిగితే అనుమానంపై పోలీసులు అతన్ని అరెస్టు చేసి జైలుకుపంపారు. పులి మీద పుట్రలా, భార్య తీవ్రమైన అనారోగ్యానికి లోనయ్యింది. ఇందులో ఏ సమస్యను పరిష్కరించుకోగల సామర్థ్యం తనకు లేదని, దైవమే తనను గట్టెక్కించాలని ప్రతిక్షణం ఆయన ప్రార్థించేవాడు. ఒక నెలరోజులపాటు, భయంభయంగా, క్షణాన్ని ఒక యుగంలా అనునిత్యం అందరు దేముళ్ళను ప్రార్థిస్తూ అతను కాలం గడిపాడు. కాని ఏ సమస్యా పరిష్కారం కాకపోగా అవి మరింతటి తీవ్రరూపం దాల్చాయి. మరుసటిరోజుకల్లా తమ బాకీచెల్లించకపోతే ఇంట్లోని సామానంతటినీ పట్టుకుపోతామని అప్పులవాళ్ళు బెదిరించివెళ్ళారు. అమ్మాయికి ఇప్పుడు అబార్షన్ చేయించడం ప్రమాదకరమని, చేయించుకోవాలనుకొంటే పదివేలవరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. మంచి న్యాయవాదిని పెట్టుకోకపోతే రెండవ కొడుకుకి ఐదేళ్ళ జైలుశిక్షపడవచ్చని శ్రేయోభిలాషులు తెలియజేశారు. భార్య మంచంలోనుండి లేవలేనిస్థితికి జేరుకొంది. దేముడు తన మొర వినిపించుకోలేదని, ఆత్మహత్యచేసుకోవడమే తన సమస్యలకు ఏకైక పరిష్కారమని రామనాథశాస్త్రి నిర్ణయించుకొంటుండగా ఒక్క వారంలో అతని సమస్యలన్నీ పరిష్కారమైపోయాయి. తాను పెద్దబెడదగా హడలిపోయిన వడ్డీ వ్యాపారులు హత్యానేరంలో ఇరుక్కొని అరెస్టయ్యారు. పెద్దకూతురు తనను మోసగించిన ప్రేమికుడి ఇల్లు తెలుసుకొని, పత్రికల్లో, టి.వి.ల్లో పెద్ద రాద్ధాంతం చేయడంతో ఆ ప్రేమికుడు ఆమెను నిజంగానే ప్రేమించానని, తల్లిదండ్రులకు చెప్పలేక మొఖం చాటువేశానని, ఇప్పుడు తల్లితండ్రులు కూడా అంగీకరించారు గనుక ఆమెను వివాహమాడతానని ప్రకటించాడు. బంగారంకొట్లో నగలను తస్కరించిన అసలు దొంగలు దొరకడంతో రెండవకొడుకు నిర్దోషిగా విడుదలఅయ్యాడు. భార్యను ప్రభుత్వ వైద్యశాలలో జేర్పించిన తరువాత ఆమె క్రమంగా కోలుకోసాగింది.

తనపట్ల దైవం కరుణ చూపడం వల్లనే తానింతటి భయంకర సమస్యల నుండి బయటపడగలిగానని రామనాథశాస్త్రి విశ్వసించుతుంటాడు. కాని ప్రతి సందర్భంలోను మానవ జోక్యం వల్లనే అతని సమస్యలు పరిష్కృతమయ్యాయి. దుర్మార్గులైన వడ్డీ వ్యాపారులు పోలీసులజోక్యం వల్లనే జైలు పాలయ్యారు. పెద్ద కూతురు చొరవ వల్లనే ఆ ప్రేమికుడు ఈమెతో వివాహానికి అంగీకరించాడు. అలాగే పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేయడం వల్లనే నగలు దొంగిలించిన అసలు నేరస్థులు పట్టుబడ్డారు. ప్రభుత్వ వైద్యశాలలోని వైద్యులను తనకు తెలిసిన వారందరితోను అభ్యర్థింపజేయడం వలన తన భార్యకు మంచి వైద్యం అందించడం అతనికి సాధ్యపడింది.

దేముడి ప్రమేయం లేకుండానే రామనాథశాస్త్రి సమస్యలన్నీ పరిష్కారమైనప్పుడు, ఇంకా దేముడి అవసరం మానవులకెందుకు అని ఎవరైనా ప్రశ్నించబోతే దైవాన్ని విశ్వసించే ఆస్తికుల సమాధానం ఇలా వుంటుంది. "తాను ఒక మానవుడినేకాకుండా, మానవ సమాజాన్ని కూడా సృష్టించడం వలన, ఆ సమాజనడవడికే అందులోని వ్యక్తుల సమస్యలను సైతం పరిష్కరించకల్గుతున్నది దైవ సంకల్పం. అందుకే ఏ సమస్యకు సంబంధించి అయినా, చిట్టచివరి వరకూ కృషి చేయవలసిన బాధ్యతను దైవం తాను సృష్టించిన అద్భుతమైన మానవ మేధస్సుకే వదిలివేస్తుంది. ఎన్నడూ అంతిమ పరిష్కారం చూపకలుగుతుందే తప్ప,

మొదట్లోనే జోక్యం చేసుకొని, ఆ భారమంతా తనపైనే వేసుకోవడం సాధ్యంకాదు. ”

శాస్త్రవేత్తలు, సాంకేతికనిపుణులు తాము చేయదగిన కృషినంతటినీ చేసిన తరువాత కూడా నెలల తరబడి అంతిమ పరిష్కారం లభించదు. ఏమీ దిక్కుతోచని నిస్సహాయతతో దైవాన్ని ప్రార్థిస్తూనే వారు ప్రతిక్షణం తమకెదురైన సమస్యలను గురించే ఆలోచిస్తుంటారు. వున్నట్లుండి ఓ మెరుపుతీగలాగా, ఆకస్మికంగా వారికి అంతిమ పరిష్కారం లభిస్తుంది. చిట్టచివరి వరకు కృషి చేయకలిగిన వారికి ఎవరి ప్రమేయమూ, ఎవరి సహాయం లేకుండా అంతిమ పరిష్కారం లభించడం మన మేధానిర్మాణంలో దాగి వున్న ఒక అద్భుతం. ఇదంతా దైవకృప వల్లే సాధ్యమైందని చాలమంది చెప్పబోతారు. ఇది గమనించి, ఎప్పుడూ చెడ్డపనులు చేయడానికి అలవాటుపడినవారు కూడా నిరంతరం తమకు మంచి జరగాలని దైవాన్ని కోరుకొంటుంటారు.

రాజారావు వడ్డీ వ్యాపారి. నిరుపేదలకు, నిస్సహాయులకు అతి ఎక్కువ వడ్డీకి అప్పులిచ్చి, వాటిని కర్కశంగా వసూలు చేసేవాడు. ఇళ్ళపైకి వెళ్ళి దౌర్జన్యం చేసేవాడు. వాళ్ళ పసిపిల్లల వంటిపై వున్న కొద్దిపాటి బంగారు వస్తువుల్ని కూడా బలవంతంగా లాక్కు వచ్చేవాడు. కేవలం పదివేల రూపాయలతో వడ్డీ వ్యాపారం ప్రారంభించిన తాను కేవలం మూడేళ్ళల్లో ఐదు లక్షల వరకు సంపాదించడం దైవకృప వల్లనే సాధ్యపడిందని అతను విశ్వసించేవాడు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పూజలు చేస్తూ దైవ కార్యాలకు భారీగా ఖర్చు చేసేవాడు. ఇక పెద్దమొత్తాలను పేదవారికి వడ్డీకివ్వడం సాధ్యపడకపోవడంతో, ఉద్యోగులకు, చిన్నతరహా వ్యాపారులకు కూడా అతను వడ్డీలకివ్వడం ప్రారంభించాడు. అనుకొన్న సమయానికి వారు తిరిగి చెల్లించకపోతే, వాళ్ళింటికి వెళ్ళి, స్త్రీలని కూడా చూడకుండా పరుషంగా నిందించేవాడు. చుట్టుప్రక్కల వారివద్ద పరువు పోతుందని భయపడుతూ అందరు తలతాకట్టుపెట్టయినా అతనికివ్వవలసింది ఇచ్చేవారు. కాని ఇతని అవమానాన్ని భరించలేక ఒకతను ఇతన్ని కత్తితో పొడిచాడు. ప్రాణాలతో బయటపడ్డాడు గాని కత్తిపోట్ల వల్ల వెన్నెముక నరం దెబ్బతిని, ఇతని శరీరమంతా చచ్చుపడిపోయింది. మంచంలో నుండి కదలలేని పరిస్థితి ఏర్పడటంతో ఇతని దగ్గర అప్పు తీసుకొన్నవారందరూ డబ్బు ఎగ్గొట్టారు. కుటుంబసభ్యులు కూడా ఇతన్ని నీచంగా చూడసాగారు. నిరంతరం దైవప్రార్థనలో మునిగి తేలుతూ, దైవమే తనకు సహాయపడతాడని అతను ఎదురుచూస్తున్నాడు

ఇతరులతో చెడుగా ప్రవర్తించేవారికి, చెడ్డ ఫలితాలే వస్తాయి. సమాజ నడవడికలోనే ఈ సూత్రం దాగి వుంది. తప్పు చేసిన వ్యక్తికి వెనువెంటనే చెడు జరగకపోవచ్చు. తాత్కాలికంగా ప్రయోజనం కలుగవచ్చు. అందుకే తామేం చేసినా దైవ కృపవుంటే తమకు మేలు జరుగుతుందని చాలామంది తప్పుగా భావిస్తుంటారు. ఇతరులకు చెడుచేసేవారికి ప్రతికూల ఫలితాలు ఎదురుకావడానికి కొంతకాలం పట్టవచ్చు. ఇందుకు భిన్నంగా తమపట్ల తమకు ప్రతికూల అభిప్రాయాలున్న వారికి తక్షణమే చెడుఫలితాలు సంక్రమిస్తాయి. నిరాశాపూరితంగా ఆలోచించడం, తనను తాను కించపరచుకోవడం, తనపట్ల తనకు విశ్వాసం కొరవడటం వంటి లక్షణాలను సంతరించుకొన్నవారి ఆలోచనలు, ప్రవర్తనవలన స్వీయహాని కలుగుతుంది. ఈ ప్రతికూల ఆలోచనలను విడనాడకుండా, దైవాన్ని ప్రార్థించడం వలన ఎటువంటి ప్రయోజనం చేకూరదు. ప్రముఖ మతప్రచారకుడు బిల్‌గ్రహం కూడా భక్తులకు ఇలా వివరిస్తాడు. “మానవుడు ఒక అద్భుతమైన దైవసృష్టి. తన శక్తి సామర్థ్యాలను శంకించుకొనే వ్యక్తి. తనను సృష్టించిన దైవశక్తినే శంకిస్తున్నాడు.”

□